# బోస్టన్ తెలుగు వారి దీపావళి ఢమాక

సర్వజిత్ నామ సంవత్సర దీపావళి పండుగను అమెరికా లోని బోస్టన్ నగర తెలుగు వాసులు నవంబర్ 10వ తారీఖున ఘనంగా జరుపుకున్నారు. దాదాపు 1400 మంది తెలుగు వారితో, సుమారు 250 మంది ప్రాంతీయ ఔత్సాహిక కళాకారులతో, ముఖ్యంగా అధిక భాగం చిన్న పిల్లల అంశాలతో, మనోరంజకంగా కార్యక్రమం జరిగింది. ఇతోధికంగా వచ్చిన ప్రేక్షకుల సౌకర్యం కోసం హాలు బయట టీవీలు ఏర్పాటు చేసి కార్యక్రమం అందరికీ అందేలా కార్యవర్గం ఏర్పాటు చేశారు. TAGB అధ్యక్షుడు శ్రీనివాస్ కాకి గారు తమ ప్రసంగంలో బోస్టన్ నుంచి, ఇతర ప్రాంతాల నుంచి, ఇతర సంఘాల నుంచి వచ్చిన ప్రేక్షకులని అహ్వానిస్తూ, అమెరికా ప్రభుత్వం దీపావళి పండుగను అధికారికంగా గుర్తించిన తరువాత TAGB నిర్వహిస్తున్న మొదటి దీపావళి కార్యక్రమం ఇది అని తెలిపారు. కార్యవర్గ సంఘం ఎన్నికల గురించి, TAGB యువత కార్యకలాపాల గురించి, న్యూహాంప్షైర్ రాష్ట్రంలో కొన్ని పాఠశాలల్లో ప్రపంచ చరిత్ర పాఠాలలో భాగంగా తెలుగు భాష గురించి, ఆంధ్ర ప్రజల గురించి అంశాలు చేర్చడానికి జరుగుతున్న ప్రయత్నాల గురించి, ఇంక వివిధ అంశాలపై నివేదిక సమర్పించారు. స్పాన్సర్లు గా, స్వచ్ఛంద సహాయకులు గా సభ్యులు ముందుకు వస్తున్నారని, ఇకపై కూడా అలాగే ఉత్సాహంతో పాల్గొనాలని మనవి చేశారు. కార్యక్రమానికి ప్రధాన సంధాతగా శ్రీమతి అను మైత్ర, సహాయకులుగా శ్రీ వంశీ, చిన్నారులు మానస జయంతి, పృథ్వి మావూరి సందర్భోచితమైన వ్యాఖ్యలతో, హాస్యంతో సమర్ధవంతంగా నిర్వహించారు.

ప్రాంతీయ చిన్నారులు తల్లి తండ్రుల ప్రోత్సాహంతో, సంగీత,నృత్య టీచర్ల సహకారంతో తమ ప్రతిభా పాటవాలని ప్రదర్శించి ప్రేక్షకులని ఆహ్లాద పరిచారు. అధిక భాగం సమకాలీన సినిమా పాటల కు అభినయం చేసే

అంశాలు వున్నప్పటికీ, కార్యక్రమంలో జానపద, శాస్త్రీయ నృత్య గీతాలు, ఏకపాత్రాభినయాలు, చిన్న హాస్య నాటికలు కూడ చోటు చేసుకున్నాయి. విఖ్యాత కళాకారిణి కుమారి లక్ష్మి మానస ప్రదర్శించిన skateల పై నృత్యం అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. చిన్న పిల్లల fashion show ప్రదర్శన వినూత్నంగా వుండి రక్తి కట్టించింది. అన్ని ప్రదర్శనలలో పాల్గొన్న పిల్లలు శ్రద్ధాసక్తులతో తమ తమ పాత్రలు పోషించి ప్రేక్షకుల మెప్పును పొందారు.

పెద్దలు చేసిన కొద్ది అంశాలు కూడా చిన్న వారి ప్రతిభకి తీసిపోని విధంగా జరిగాయి. ముఖ్యంగా నాటి నుంచి నేటి దాక, నాలుగు దశాబ్దాల సినిమా పాటల విభావరిని "నాడు నేడు పాటల తీరు " అనే టైటిల్ తో, ప్రవాసాంధ్రా దంపతులు చేసిన హుషారయిన నృత్యాభినయంతో ప్రేక్షకులని మధుర భావాలలో ముంచెత్తి ఇంకా కావాలన్న భావన కలిగించింది. 'సీతాపతి కళ్యాణం' హాస్యనాటిక నవ్వుల జల్లులు కురిపించింది.

ఈ కార్యక్రమంలో TAGB యువత (TYAGB) సభాస్థలి అలంకరణ, అల్పాహార విక్రయం, ప్రేక్షకులకి సహాయ పడటం వంటి చాలా అంశాలు నిర్వహించడం విశేషం. వ్యాపార సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు పెట్టిన స్టాల్స్ కూడా ఈ కార్యక్రమంలో నూతనం. మినర్వా హోటల్ వారు ఏర్పాటు చేసిన విందు భోజనం ఒడిదుడుకులుండి కూడా అందరి మన్ననలు పొందింది. చివరి అంశంగా ఉపాధ్యక్షులు డా. సూర్యా జయంతి గారు వందన సమర్పణ చేశారు. కార్యక్రమానికి ఆర్థిక దాతలైన కేంబ్రిడ్జ్ రిసోర్స్ గ్రూప్, ఐకా సిస్టెంస్, డా. బాబు పీడియాట్రిక్స్, శ్రీ మూర్తి మరియు వాణి కన్నెగంటి, డా. నానా రావు, శ్రీ శ్రీనివాస్ మరియు పద్మాంజలి కాకి, శ్రీ శేఖర్ నల్లా, రోషిటెక్ మరియు Alankar Decoration వారికి ముఖ్యంగా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కళాకారులకి, చిన్న పిల్లలని

ప్రోత్సహించిన తల్లి-తండ్రులకి, చివరిదాక వుండి ఆనందించిన ప్రేక్షకులకి కృతజ్ఞ్యతలు తెలపిన తరువాత జాతీయ గీతాలాపనతో సభ విజయవంతంగా ముగిసింది.

- దేవరకొండ శ్రీనివాసరావు, వెస్ట్ ఫోర్డ్